Local News







# జర్నలిస్టులపై ఆర్టీసీ ఉద్యోగుల దౌర్జన్యం

■ **పాస్ ఉన్నా.. బస్సు దిగాలని దుర్భాష**

**జనగామ, మన చౌరాస్తా :** ఓవైపు ఆకలి చావులు.. మరోవైపు అవమానాలు.. జర్నలిస్టలకు అడుగడుగునా అవమానాలు తప్పడం లేదు. హనుమకొండలో జర్నలిస్టు యోగిరెడ్డి చనిపోయిన విషయం తెలిసిందే.. అయితే అయన అంత్యక్రియల కోసం జనగామలో జరుగుతున్నందున అక్కడి వెళ్లేందుకు హనుమకొండలో బస్సు ఎక్కేందుకు వచ్చిన జర్నలిస్టులపై ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ దౌర్జన్యానికి దిగారు. ఒకే బస్సులో ఎంతమంది వస్తారంటూ గొడవ పెట్టుకున్నారు. 'డ్యూటీలో లేకుంటే నీ సంగతి చూసే వాడి' అంటూ బెదిరింపులకు దిగారు. 'ఎవడికి చెప్పుకుంటావో చెప్పుకో.. అరేయ్ వీడి పాస్ గుంజుకుని డిపోలో అప్పజెప్పు అక్కడ మాట్లాడదాం..' అంటూ నోటికి వచ్చినట్టు దుర్భాషలాడారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, జర్నలిస్టులపై అసభ్య పద జాలాలతో దూషించిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ సహచర కార్మికులపై వెంటనే చర్యలు తీసుకొని, వారిని సస్పెండ్ చేయాలని జనగామ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు జనగామ జర్నలిస్టులు శనివారం సాయంత్రం వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఇర్రి మల్లారెడ్డి, కార్యదర్శి ఎస్. భిక్షపతి, కోశాధికారి ఓరుగంటి సంతోష్‌కుమార్, జర్నలిస్టు నేతలు పార్నంది వెంకటేశ్వర్లు, ఉపేందర్, మణి, బొమ్మగాని శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్నను దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్

**చేర్యాల, మన చౌరాస్తా :** కొమురవెల్లి మల్లన్నను సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఈఓ బాలాజీ, ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకుడు సురేందర్ స్వాగతం పలుకగా అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత అడిషనల్ కలెక్టర్‌కు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు.



# గరిట పట్టి.. గారెలు కాల్చి..

■ **మిర్చి బండి వద్ద ఎమ్మెల్యే కడియం**

**హనుమకొండ, మన చౌరాస్తా :** స్వశక్తితో వ్యాపారం చేస్తూ మరొ నలుగురికి ఉపాధి కల్పించిన తాడూరి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి అభినందించారు. హనుమకొండలోని ఎక్సైజ్ కాలనీలో రోడ్ సైడ్ బండి వద్ద కడియం శనివారం మిర్చి, గారెలు తిన్నారు. నియోజకవర్గ పలు కార్యక్రమాలు ముగించుకుని తిరుగు ప్రయాణంలో రోడ్డు పక్కనే ఉన్న మిర్చి బండి వద్ద ఆగి గరిట పట్టి మిర్చి, గారెలను కాలుస్తూ వ్యాపారులతో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వశక్తితో వ్యాపారం చేస్తూ మరొ నలుగురికి ఉపాధి కల్పిస్తున్న తాడూరి శ్రీనివాస్‌ను అభినందించారు. ఇలా వ్యాపారం చేస్తూనే శ్రీనివాస్ కుమారులను అమెరికాలో ఉన్నత చదువులు చదివించడం అభినందనీయమన్నారు. ఉద్యోగాలు రాలేదని నిరుత్సాహానికి గురవుతున్న యువత వారు ఎంచుకున్న మార్గాల్లో కష్టపడి పనిచేస్తే ఎంతటి విజయాన్ని అయినా సాధించవచ్చని ఈ సందర్భంగా సూచించారు.









# జీవో 33ను వెనక్కి తీసుకోవాలి.

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్రంలో మెడికల్ ప్రవేశాలకు ( ఎంబీబీఎస్, బీడీఎస్)లో స్థానికత నిర్ణయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 33ను వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ డిమాండ్ చేశారు. శనివారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మన తెలంగాణ విద్యార్థులకు కూడా ఇతర రాష్ట్రాలో 9 నుంచి 12వ తరగతులు చదివే అవకాశం ఉందన్నారు. ఈ జీవో వల్ల తెలంగాణ విద్యార్థులు కూడా స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 6 నుంచి 12 వరకు 07 ఎండ్ల కాలంలో ఎదైనా 4 అకడమిక్ ఇయర్స్ చదివి ఉంటే స్థానికులు అని నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 9-12 వరకు చదివి ఉంటే స్థానికులు అని చెబుతోందన్నారు. దీని వల్లన రాష్ట్రంలో స్థానికత అంశంలో ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చిన వారు కూడా స్థానిక కోటా పోందుతారని అన్నారు. దీంతో స్థానికులు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. మెడికల్ విద్య ప్రవేశాలలో కూడా ఉద్యోగ నియామకాలు కోసం తీసుకుంటున్న స్థానికతనే (1 నుంచి 07 తరగతి) పాఠశాల విద్యను ప్రమాణికంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ కోరుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్యా, మురళి, శ్రీనాథ్, రాజేష్, పవన్, కల్యాణి , మేఘన పాల్గొన్నారు.



# సామూహిక సీమంతం

జనగామ, మన చౌరాస్తా : జనగామ పట్టణంలో కల్కి భగవాన్ ఆలయంలో 35 మంది మహిళలకు సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. 5 రకాల పండ్లు, 5 రకాల స్వీట్స్, 5 రకాల కార, వారికి చీరే సారే ఏర్పాటు చేసి అత్యంత వైభవంగా ఈ సీమంతం కార్యక్రమాన్ని జరిపించారు. ఈ సందర్భంగా కల్కి భగవాన్ సేవకులందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

